# అతి సర్వత్ర...

ఎడమ వైపు, జాకెట్టు కిందగా, తాళం చేతుల్తో గుమ్మటంలా ఉన్న ఓ వెండి గుత్తిని, చీరలో దోపుకుని, ఆ గదిలోంచి ఈ గదిలోకి, మండువాలోకి, వంటింట్లోకి, నట్టింట్లోకి, పెరట్లోకి వెళ్తుంటె ఘల్లు ఘల్లుమంటూ వెళుతున్న లక్ష్మీదేవిలా ఉంటుంది కాంతాలు. ఆ వెండి తాళాల గుత్తి ఆమెకు మంచి శోభనిచ్చింది. ఆమె హోదాని ఒక్క రవ్వ పెంచిందనే చెప్పుకోవాలి.

లయబద్ధంగా వినిపించే ఆ తాళాల గుత్తి శబ్దం, ఆమె ఎక్కడుందో, ఎంత దూరంలో ఉందో చక్కగా అనువాదం చేస్తుంది. దానితో, కోడళ్ళు, పనివాళ్ళు, పిల్లలు భక్తి - భయంతో ఏదో పని చేస్తున్నట్లుగా నటించేవారు. నిజానికి కాంతాలుకి తాళాలు సేకరించి, లిమ్కా బుక్కులోనో గిన్నీస్ బుక్కులోకో ఎక్కాలని లేదు. ఏదో రికార్డులు బద్దలు కొట్టెయ్యాలన్న కోరిక కూడా లేదు.

ఆమె దగరున్న వాటిల్లో చాలా వాటి అవసరం లేనే లేదు. ఆ సంగతి అందరికీ తెలుసు. అందులో పాత సైకిళ్ళు పాడైపోయిన తాళాలచేతులు కూడా ఉన్నాయి. అయినా వాటిని పారేయడం ఇష్టం లేక వాటిని వేరు చేయలేదు. పారేయడం ఎందుకు, పాపం ఉంటాయి అని అనుకుంటుంది. అయితే అన్ని తాళం చేతులు ఒక్క చోట ఉండడం వల్ల ఒక్కోసారి ఏ తాళం చెయ్యి దేనిదో వెంటనే గుర్తురాక తికమక పడిన సమయాలు కోకొల్లలు. అయినా సరే కాంతాలు వాటిని విడదీయ దల్చుకోలేదు. ఒక్క చోట అలా సంఘీభావంతో ఉన్న గుత్తికి, దాని శబ్దానికి అంతా అలవాటు పడిపోయారు. కాంతాలు కూడా ఆ యింటి సర్వాధికారాలు తన దగ్గరున్నాయంత గర్వంగా ఠీవిగా మహారాణిలాగా ధీమాగా నడుస్తూ ఉంటుంది.

ఐతే వసుధైక కుటుంబంలా ఉండే ఆ తాళాల గుత్తివల్ల పరిస్థితి

వికటించిన సమయాలు కూడా ఉన్నాయి.

ఓ మధ్యాహ్నం రెండిళ్ళ అవతల ఉన్న తోడికోడలింటికి వెళ్ళింది కాంతాలు. ఆ యింటికి వెళ్ళిన ఓ అరగంటకే పెద్దకోడలు, తన కొడుకుని పంపింది స్టోర్‌రూం తాళాలు కావాలని. గుత్తి పూర్తిగా మనవడికిచ్చేసి, తన శక్తిని ఓ చిన్నపిల్లాడి ద్వారా కోడలికి పంపడం అధికారాన్ని ధారాదత్తం చేయడం కాంతాలుకి బొత్తిగా ఇష్టం లేదు. అందుకని గుత్తి తీసి స్టోర్ రూం తాళం చెవిని వేరు చేసి ఇచ్చింది.

"ఉరేవ్, జాగ్రత్త! గమ్మున తీసుకురావాలి. ఏం బోధపడిందా? ఇక్కడున్నట్లురా ... జాగ్రత్త" అని కూడా అంది.

"అలాగే నానమ్మా!" అంటూ ఆ తాళం చెవిని తీసుకుని తుర్రుమన్నాడు.

ఆ తరువాత ఓ ఐదు నిముషాలు మామూలుగానే ఉంది. ఇంక ఆ తరువాత క్షణం నుంచీ మనవడు తెచ్చే తాళం చెవి కోసం ఎదురుచూడడం మొదలు పెట్టింది.

ఎప్పటికీ మనవడు వచ్చే జాడ లేకపోతే తెలియని గాబరా ఆమెని చుట్టేసింది. ఇంక అక్కడ కూచోలేకపోయింది. ఇంటికి వచ్చేసింది. ఇంటి ముందరే నేల చూపులు చూస్తూ అటూ ఇటూ తిరగుతున్న మనవడు కనపడ్డాడు. మనసు కీడు శంకించింది ఐనా తేరుకుంది.

"ఏరా ఏదీ తాళం చెయ్యి? ఇలా తీసుకెళ్ళి అలా తెమ్మన్నాను కదా? ఇక్కడేం చేస్తున్నావూ?" అంటు దీర్ఘాలు తీసింది.

వాడు తల ఎత్తలేదు. కళ్ళెత్త లేదు. అలా కింద చూస్తూ ఉండి పోయాడు.

"ఏరా మాట్లాడవేం?"

ఒక్కసారి తడబడ్డాను.

"అదే నానమ్మా... అదే... నేనూ... దానికోసమే చూస్తున్నా.

వాధూలసగోత్రీకులకి సహజంగానే పుట్టుకతోనే వచ్చిన కోపం కాంతాలుకీ వచ్చేసింది. వెంటనే నషాళానికంటుకుంది. బాధ్యత లేదని మనవణ్ణీ,

పెంపకం సరిగ్గా లేదని కోడల్నీ ఎన్ని అనాలో అన్నీ కూడా ఛెడామాడా అనేసింది. కర్తవ్యం తెలుసుకున్న ఇంట్లో వాళ్ళంతా పోయిన తాళం చెవికోసం కోనకోనలా మూలమూలలా అంతా వెదికారు. కానీ ఫలితం శూన్యం.

కాంతాలు పోరు పడలేక కొడుకులిద్దరూ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమలాపురం వెళ్ళి కనుక్కొచ్చారు ఉత్తమమైన మార్గాన్ని

"మీరు అలా అలా నోటితో చెపేస్తే చాలా కష్టం. మీరు చెప్పిన దాన్ని బట్టి తాళం చెవి చేయలేం. తీరామోసి చేసాక అది తాళంలో దూరుతుందో లేదో. ఒకవేళ దూరినా, తిరిగి అది బయటికి వస్తుందో లేదో... అందులోనే ఉండిపోతే... అయినా తాళం పాతదని మీరే అంటున్నారు కాబట్టి దాన్ని పగల కొట్టడం ఒక్కటే మార్గం." అని పరిష్కారం చూపించాడు.

ఇంటికి రాగానే సుత్తిని వెదికి తెచ్చి పని మొదలు పెట్టారు. కాంతాలు తననే సుత్తితో మొత్తుతున్నట్లుగా అనిపించింది. చచ్చిపోయిన మామగారి పుస్తకాల అలమారాదో, పాతబొమ్మలున్న అలమారాదో ఐతే బెంగ లేదు. వాటి అవసరమైతే వెంటనే లేదు. కానీ ఇది ఇంట్లో వాళ్ళ జఠరాగ్నిని చల్లార్చడానికి కావలసిన పదార్థాలుండే గది తాళం చెవి. అది తెరుచుకుంటేనే దీపాలు పెట్టే వేళకల్లా వంటవుతుంది. లేకపోతే...

ఆ సుత్తి శబ్దాలు వినలేక చెవులు మూసుకుంటూ తనగదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుని మౌనవ్రతం ప్రారంభించింది.

ఏ సత్యాగ్రహమైనా చెయ్యొచ్చు గానీ మౌనవ్రతంలా సాగే సత్యాగ్రహం... ఆడవాళ్ళకైనా మగవాళ్ళకైనా చాలా కష్టమే. ఏదో గాంధీగారంటే... వేరు... ఆయన థియరీ వేరు. అది ఆయనకే చెల్లింది. ప్రస్తుతం కాంతాలు గాంధీగారు కాదు కాబట్టి సత్యాగ్రహం విజయవంతం అయిందనడానికి వీల్లేదు. ఎందుకంటే కాంతాలు ఓ స్త్రీ. ఎక్కువ సేపు ఉండలేకపోయింది. ఐతే ఆ విరిగిన తాళం ముక్కల్ని ఏరి ఓ మూల దాచింది. ఇది జరిగి ఎంతో కాలం కాలేదు.

కావడానికి అదీ పల్లెటూరే. కానీ అతిథులూ, అభ్యాగతులూ ఎక్కువగానే వస్తుంటారు. ఐతే అది సీజనల్. ఉద్యోగరీత్యా వేరేనగరాల్లో ఉంటున్నా ఇంకా ఇళ్ళూ వాకిళ్ళూ పొలం పుట్రా ఉండడం వలన కానీ, ఊరి మీద ఉన్న మమకారం కానీ ఏదైనా కానీ వెళ్ళిపోయిన వాళ్ళు దేవుడి వైశాఖమాసం పెళ్ళికీ, శరన్నవరాత్రులకీ, కార్తీకమాసం శివాలయంలో చేసే రుద్రాభిషేకాలకి, లక్ష బిల్వార్చనలకీ ఇలా వాళ్ళకి తోచిన వీలైన సమయాల్లో వస్తూ ఉళ్ళో వాళ్ళని పలకరిస్తూ, వాళ్ళ ఇంళ్ళకి వెళ్ళడం లాంటివి జరుగుతున్నాయి.

అలా ఓ సారి ఓ నల్గుగురు ఆడా మగా అతిథులు కాంతాలు ఇంటికి వచ్చారు. కోడళ్ళిద్దరూ టీ చేయడం కోసం లోపలికెళ్ళారు. ఆ సఖ్యతకి వచ్చిన వాళ్ళు ముచ్చట పడ్డారు. టీకి నీళ్ళు పొయ్యి మీద గిన్నెలో పెట్టి టీ డబ్బా చక్కెర డబ్బాలు పక్కన పెట్టుకుని మూతలు తీసి చూసింది చక్కెర నిండుకుంది అంది చిన్న కోడలు.

"అయ్యో అక్కా! చక్కెర నిండుకుంది. అత్తయ్యనడిగి తాళం చెయ్యి తీసుకురా!"

"అలాగే" అంటు మంచి నీళ్ళు ఇచ్చే వంకతో వీధి సావిడి గదిలోకి వెళ్ళి అత్తగారి దగ్గరికొచ్చి తాళంచేతులివ్వమని అడిగింది. కాంతాలుకి అలా అందరి ముందూ తాళాల గుత్తి ఇవ్వడం ఇష్టం లేదు.

"నువ్వు పద, నే వస్తున్నా" అంటూ స్లోమోషన్ లో లేచింది.

తొందరగా గోడకున్న అలమార తలుపు తీయాలన్న ఊహతో కాంతాలు ఓ దానికొకటి దూర్చింది. తాళం తెరుచుకోలేదు. సరే అనుకుని ఆ చెవిని లాగబోయింది కాంతాలు తెరుచుకోనే లేదు. లాగింది. అదిరాలేదు. అటూ ఇటూ తిప్పింది.

అది బయటికి రానని మొరాయించింది. పైగా ఇంక బిగుసుకు పోయింది. "నువ్వక్కడ కూర్చో. బాగుండదు మనం ఏదో మంతనాలు చేస్తున్నా మనుకుంటారు... వెళ్ళు... నే దీని సంగతి చూస్తా" అంటూ పెద్ద కోడల్ని వచ్చిన చుట్టాల దగ్గరికి పంపింది.

టీ రాక పోయేటప్పటికి పెద్ద కొడుకు లోపలికి వెళ్ళాడు.

"వాళ్ళనక్కడ కూర్చోపెట్టి మీరేం కబుర్లు చెప్పుకుంటున్నారు? టీ ఏది? పావు గంట నుండి కూర్చోని ఉన్నారు."

అంటూ ఆ ఇద్దర్నీ చూశాడు.

సంగతి తెలుసుకున్నాడు.

"దీనికింత గోడవేవిటి? ఈ వెనకాలనించి వెళ్ళి పెద్ద పిన్ని ఇంట్లోంచో బుల్లి పిన్ని ఇంట్లోంచో తేవచ్చు కదా? అవతల వాళ్ళు వెళ్ళిపోతామంటున్నారు. మీరిచ్చే టీనీళ్ళ కోసం వాళ్ళు కూచుంటారను కుంటున్నారా! తొందరగా తెచ్చి టీ చెయ్యండి." అంటు కర్తవ్యం బోధించి వెళ్ళిపోయాడు.

"అలాగే" అంటూ లేచింది కోడలు కాంతాలు ఎడంచేత్తో వారించింది.

"ఆగు ఎక్కడికీ వెళ్ళేది? అలా వెళ్తే మన పరువు పోదా? పక్కనే ఉన్న ఆ వెంకాయ్ నోరు అసలే ఓ టీవీవార్తల ఛానెల్. ఆ మొగలో నిలబడి వచ్చే వాళ్ళకీ, పోయేవాళ్ళకీ, అడిగే వాళ్ళకీ, అడగని వాళ్ళకీ ఆపి మరీ చెప్తుంది. మనం ఎంత తెలివి తక్కువ పని చేశామో ఊరూ వాడా టాం టాం చేస్తుంది. కొబ్బరి బోండాలు తీసినవి ఉన్నాయి, కొట్టి ఇచ్చేయండి వాళ్ళకి."

అప్పుడే ఇంటికి వచ్చిన చుట్టాలు ఇంట్లో వాళ్ళు చేసుకున్న సదుపాయాలూ అవీ చూస్తూ వంటింటి దగ్గరకు వచ్చారు. "పల్లెటూరైనా అన్నీ బాగా చేసుకున్నారు. బావుంది ఇంక మేం వస్తాం."

"ఉండండి గంగా బోండాలు తీసి ఇస్తాం తాగి వెలుదురు కాని."

వాళ్ళు వెళ్ళాక ఇంట్లో కళింగ యుద్ధం అయింది.

మళ్ళా తాళం బద్ధలు కొట్టారు.

కాంతాలు వ్రతం చేసింది.

ఆ రాత్రికి ఉద్యాపన కూడా చేసేసుకుంది.

ఇలాకాదని, ఈ మౌనవ్రతాలు, ఆగ్రహంతో సత్యాగ్రహాలూ ఉద్యాపనలూ భరించలేమని ఇంట్లో వాళ్ళకి అర్థమైపోయింది. కాంతాలు పెద్దకొడుకు హైదరాబాద్ ఏదో పనిమీద వెళ్ళినప్పుడు నెంబర్లున్న తాళం తెచ్చాడు. ఆ నెంబర్లు సరిగ్గా తిప్పితే ఆ తాళం తెరుచుకుంటుంది. నెంబర్లని అటూ ఇటూ మార్చేస్తే తాళం మూసుకుపోతుంది. మరి తెరుచుకోదు. ఇదేదో బాగుంది ఏ గొడవ ఉండదు అని అనుకుని అంతా సంబరు పడ్డారు. కాంతాలుకి కూడా ఈ అక్షరాస్యత ఉన్న తాళం చాలా నచ్చింది. బాగా సంతోషించింది. కానీ ఆ

సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు.

జీడిపప్పులూ, వేపుడు బియ్యం, జంతికలూ, నెస్కాఫీలూ, చక్కెరా, టీ పొడీ ఇష్టం వచ్చినట్లుగా రెక్కలు తొడుక్కుని ఎగిరిపోతున్నాయని గ్రహించింది. ఒకటి రెండు సార్లు రెడ్ హేండెడ్‌గా పట్టుకుంది. ఆమెకి తెలిసిపోయిందని వాళ్ళకి తెలిసిపోయింది. ఆ తరువాత కాంతాలు ఆ తాళాన్ని తీసి నూతిలో పడేస్తుంటే ఎవరూ నోరెత్తలేదు. తాళం అక్షరాస్యత అనర్ధ దాయకం అని తెలుసుకుంది కాంతాలు.

ఈ మూడు అనుభవాలు మిగిల్చిన చేదులోంచి పాఠం నేర్చుకుంది కాంతాలు.

ఆలోచనలో పడింది తాళం నొక్కగానే పడిపోవాలి. తెరవడానికి మాత్రం తాళం చెవి కావాలి. ఇంట్లో వాళ్ళ భయం ఉండదు. అటూ ఇటూ తిరిగే వాళ్ళనించి కూడా భయం ఉండదు. తనే స్వయంగా అమలాపురం వెళ్ళి తెచ్చుకుంది.

ఆ భోగం కూడా ఎక్కువ రోజులు నిలవలేదు.

ఆ రోజున అత్తగారూ కోడళ్ళూ కలిసి జంతికలూ, లస్కోరా ఉండలూ చేశారు. అన్నింటినీ నాలుగు కుంచాల డబ్బాల్లో సర్దుతుండగా వీధిలో సన్నాయీ డోలూ వినబపడింది. వీధి తలుపులు తీసి ఉన్నా తలుపు టకటకా కొట్టారు.

"ఏవండోయ్ ఉన్నారా?"

కోడళ్ళిద్దరూ గబగబా వెళ్ళారు. ఈ లోపునే కాంతాలు డబ్బాలన్నింటినీ గోడకి ఉన్న అలమారలో పెట్టి తాళం నొక్కి చేతులు తుడుచుకుంటూ నవ్వుతూ బయటికి వచ్చింది.

వీధి చివర ఉన్న వడ్లమాని వారి కోడలు గ్రామకుంకం నోము చేసుకుందిట. ఆమె అమెరికానుంచి వచ్చి ఇక్కడ నోము నోచుకుందిట. ఆమెకు ఊళ్ళో వాళ్ళతో పరిచయం లేదని, ఇంట్లో వాళ్ళందరూ కూడా ఆమెకు తోడుగా సంబరంగా వచ్చారు.

ఆ యింట్లోని ఆడవాళ్ళందరూ ఓ కావిడిలో పసుపు కుంకం అరటి పళ్ళు పెట్టుకుని వచ్చారు.

"రెండు పళ్ళాలు తీసుకురండత్తయ్యా!" వచ్చిన వాళ్ళలో అందరి కన్నా చిన్నావిడ అంది.

వాళ్ళు వెళ్ళిపోయాకా, వాళ్ళు యిచ్చిన, కుంకం, పసుపు స్టోర్ రూంలో పెడ్దామని, తాళాలున్న గుత్తి కోసం చూసింది. స్థాన చలనం కలిగినట్లుంది దానికి.

వెంటనే గుర్తొచ్చింది. వంగి, కూచుని, లేస్తూ, అటూ ఇటూ నడుం తిప్పుతూంటే తాళాలు గుచ్చుకుంటున్నాయని తీసి ఉన్న అలమారలోనే అక్కడే పెట్టింది. వాళ్ళెవరో వచ్చేస్తున్నారని గబ గబా తాళం వేసేసింది.

తప్పిదం జరిగిపోయింది. శిక్ష అమలు పర్చాల్సిందే.

ఆ శిక్ష అందరికీ తెలిసినదే.

కాంతాలు మౌనవ్రతం పట్టింది.

తాళం బద్దలు కొట్టారు.

మూడు రోజుల తర్వాత వ్రత భంగం కావించింది.

కాళ్ళు కిందకి వేసుకుని మండువా చుట్టూరా కూచున్నారు యింట్లో వాళ్ళంతా.

"కాంతం! ఏవిటీ పిచ్చి? ఎందుకన్ని తాళం చేతులు పెట్టుకుని తిరుగుతావు?" కాంతం భర్త అన్నాడు.

"నాన్నా! అందులో నా పాత సైకిల్ తాళం చేతులు కూడా ఉన్నాయి." అంటూ నవ్వాడు పెద్ద కొడుకు.

"లబ్ధ ప్రతిష్ఠులైన కోడళ్ళున్నారు, నీ అధికారాన్ని వాళ్ళ హస్తగతం చెయ్యి......" కొడుకులు విడివిడిగా అన్నా అర్థం అందరిది ఒకటే.

పెటేల్, పెటేల్ మంటూ శబ్ధాలు చేస్తూ లావా బయటికి రాకపోయినా, నిశ్శబ్ధంగా అగ్ని పర్వతాలు ఆమెలో బద్ధలయ్యాయి.

అదేదో సినిమాలో సూర్యకాంతంలా బొడ్డులోంచి వెండి గుత్తి తీసి కోడళ్ళ వైపు పడేసి విసా విసా నడిచి గదిలోకి వెళ్ళిపోయింది కాంతాలు మళ్ళా మౌనవ్రతం పాటించడానికి........!

(సుజన రంజని, ఏప్రిల్ 2007)